ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యం

ధీరా పౌండేషన్ అధినేత బొత్స సంధిప్ బాబు

విశాలాంధ్ర - గుర్ల : మండలంలో కొండగండ్రేడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఆయన మంగళవారం సందర్శించారు. బొత్స సంధిప్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య రక్షణ లక్ష్యంగా అమలు చేస్తున్న ఆరోగ్య సురక్షతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇది ప్రజారోగ్యంపై సీఎం జగనన్నకు ఉన్న ప్రత్యేక శ్రద్ధకునిదర్శనమన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారితో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు మీ ఆరోగ్య భద్రతకు సంబంధించి ఎటువంటి పరీక్షలు నిర్వహించారు. మీకు సంతృప్తికరంగా ఉందా? అంటూ వైద్య సేవలు పొందుతున్న ప్రజలతో ముఖాముఖి మాట్లాడి అరా తీశారు. కంటి పరీక్షలు చేస్తున్న వారి వద్దనే ఉండి వారికి మందులను అందజేశారు. ప్రతి గ్రామంలో ఇద్దరు వైద్యులతో రెండు పర్యాయాలు పర్యటించి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఇంటికే వచ్చి బీపీ, షుగర్, మలేరియా, డెంగ్యూ వంటి 7 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. మెరుగైన వైద్యంతో పాటు నాణ్యమైన మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరం అయిన వారికి ఆరోగ్యశ్రీ పథకంతో శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పశుసంవర్ధక చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు స్వామి నాయుడు,సర్పంచులు గోవింద్, సురేష్, ఎంపీటీసీ సభ్యులు రామారావు, జోగునాయుడు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర - శృంగవరపుకోట : హిందూ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా ఎస్.కోటలోని శ్రీదారగంగమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విజయనగరం రాధరమణి అధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమంలో పుణ్యగిరి ట్రస్టు బోర్డు చైర్మన్ పాలమరశెట్టి రామకృష్ణ, బోర్డు డైరెక్టర్లు, ఆలయ ప్రధాన అర్చకులు రాజగోపాలాచార్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. హిందూ ధర్మం, ఆధ్యాత్మికత ప్రపంచంలోనే పేరొందినవని వక్తలు గుర్తు చేశారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు సాధనకై అక్టోబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా

ఏపీ ఆటో టాటా మ్యాజిక్ ఓనర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : డ్రైవర్లకు సంక్షేమ బోర్డు సాధనకే అక్టోబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా జరిగే కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమంలో డ్రైవర్లంతా పాల్గొనాలని ఏపీ ఆటో టాటా మ్యాజిక్ ఓనర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి డ్రైవర్లకు పిలుపు ఇచ్చారు మంగళవారం స్థానిక అమర్ భవన్ లో శ్రీ వెంకటేశ్వర టాటా మ్యాజిక్ ఓనర్స్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) అనుబంధ జనరల్ బాడీ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు అధ్యక్షతన జరిగింది కార్యక్రమానికి "ఏపీ ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామన మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ తో కూడినసంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు జరిపి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని ఆటో అండ్ మోటార్ వాహన డ్రైవర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల మంది డ్రైవర్లు వ్యానులు కార్లు ఆటోలు నడుపుకుంటూ తమ కుటుంబాన్ని పోషించు కుంటూ ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్న డ్రైవర్ల పై ప్రభుత్వం కర్రపెత్తనం చేయడం తగదన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణ పేరుతో 8 94 గజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 మరియు 31 తెచ్చి డ్రైవర్ల పై వేలాది రూపాయలు జరిమానాలు వేస్తుందని మండి పడ్డారు. మోటార్ వాహనాలపై పెనాల్టీలు పెంచే జీవోలు వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి అరికట్టాలని ప్రైవేటు ఫైనాన్సర్ల అక్రమ వడ్డీలు రద్దు చేయాలని అప్పు చేసిన వాహనాలకు 24 గంటల్లో క్లియరెన్స్ లెటర్స్ ఇవ్వాలని కోరారు. డ్రైవర్ల పై వేస్తున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా డ్రైవర్లు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ డ్రైవర్లు చేసే ఎటువంటి పోరాటాల కైనా ఏఐటీయూసీ తరపున తాము సిద్ధంగా ఉన్నామన్నారు ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షులు పి.ఈశ్వరరావు, ఎస్ఎస్ రెడ్డి, కే.చిన్న నాయుడు, టి తిరుపతిరావు, యు.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పశుదన్ జాగృతి అభియాన్

విశాలాంధ్ర - గరివిడి : భారత దేశ 75 వసంతాల స్వతంత్ర ఉత్సవాల భాగంగా "ఆజాద్ క అమృత్ మహోత్సవ" లో భాగంగా " పశుదన్ జాగృతి అభియాన్" అను అవగాహన భారత ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెగా పశు వైద్య శిబిరాలను ఇండియాలొ ఎంపిక చేయబడిన 112 జిల్లాలలో నిర్వహించడం జరుగుతుంది. ప్రతి జిల్లాకు రెండు క్యాంపుల చొప్పున భారత పశు సంవర్ధక శాఖ ఢిల్లీ వారు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడు జిల్లాలు (కడప, వైజాగ్, విజయనగరం జిల్లాలు) ఎంపిక చేశారు. ఈ క్యాంపుల నిర్వహణ బాధ్యతను శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం తిరుపతికి కేటాయించారు. తదుపరి పశు విశ్వవిద్యాలయం వారు ప్రాంతీయంగా విజియ నగరం జిల్లా గరివిడి పశు వైద్య కళాశాలకు నిర్వహణ బాధ్యత అప్పచెప్పారు. గ రివిడి పశు వైద్య కళాశాల మరియు పశుసంవర్ధక శాఖ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించ బడుతుంది. అందులో భాగంగా విజయనగరం జిల్లాలోని కర్లాం (చీపురుపల్లి మండలం) గ్రామంలొ ఈ రోజు నిష్ణాతులైన పశువైద్యులచే , పశువులలో పునరుత్పత్తి సమస్యలు, సాధారణ వైద్య పరీక్షలు శస్త్ర చికిత్సలు, రక్త,మల పరీక్షలు నిర్వహించటం జరిగినది. పశువులను ఏ విధంగా పోషించాలి, పాల ఉత్పత్తి పెంపు, పశువులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించి, సాంకేతిక విప్లవం తీసుకుతీసుకు రావటం వలన అధిక రాబడులు పొందవచ్చు. రైతు శ్రేయస్సు ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, సన్న కారు రైతుల అభ్యున్నతి సాధించడంలో, పాడి పరిశ్రమ అభివృద్ధి అవసరం ఎంతైనా ఉందని తలచి ఆ దిశగా ఈ కార్య క్రమాలు జరుపుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రతిఘటించండి : వామపక్షం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విద్యుత్ బిల్లులు చూడగానే షాక్ కొడుతుందని పెరిగిన బిల్లులతో జనం గగ్గోలు పెడుతున్నారని వామపక్ష పార్టీలు సీపీఐ, సిపిఎం, సిపిఐఎం పార్టీల జిల్లా కార్యదర్శులు రమణ, తమ్మినేని సూర్య నారాయణ, బి.శంకరరావు వెల్లడించారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ వాడకం పెరగటం కాదు. ప్రభుత్వం ఒకేసారి సర్దుబాటు చార్జీల పేరుతో మూడు పోట్లు పొడిచిందని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయి ప్రజలకు షాక్ ఇస్తున్నాయనీ ఆరోపించారు.. గత సంవత్సరం కరెంటు చార్జీలు పెంచి 1400 కోట్ల రూపాయల భారం మోపిందన్నారు. స్లాబులు గా మార్చేశారని ప్రజల కళ్ళు కప్పి గత పది ఏళ్ల నుంచి వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో జనం నెత్తిన తాజాగా 6 వేల కోట్ల రూపాయల భారం వేశారని తెలిపారు. నాలుగేళ్లలో 25 వేల కోట్ల రూపాయలు ప్రజల నెత్తిన మోపారని అన్నారు.ఈనెల బిల్లులో 2014 సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్ళీ యూనిట్ 20 పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్తు యూనిటు మరో 20 పైసలు, 2023 ఏప్రిల్ నెలలో ఉపయోగించిన కరెంటుకు యూనిట్కు 40 పైసలు కలిపి మొత్తం యూనిటు 80 పైసలు చొప్పున జనం నెత్తిన బండ వేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటివరకు రెండేళ్ళకో, మూడేళ్లకో కరెంట్ చార్జీలు పెంచేవారనీ మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ఇక ప్రతి నెల వంటగ్యాస్ లాగానే కరెంటు చార్జీలు కూడా పెంచడానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. కరెంట్కి బిల్లులే కాకుండా ఫిక్స్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారని అన్నారు.అసలు చార్జీలకంటే కొసరు చార్జీలు ఎక్కువ అన్నారు. దీనివల్ల పేద,మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారు. కరెంట్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా రేపటి నుండి కరపత్రం ప్రసారం చేసి ప్రజలను చైతన్య వంతులను చేసి భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతున్నామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర - నెల్లిమర్ల : నెల్లిమర్ల మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్రియాట్రి డిపార్ట్మెంట్ హెచ్ఓడి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానిసిక ఇబ్బందులపై అపోహలను వీడాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ జి హేమంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ పావని, వైద్యులు ఐశ్వర్య, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులను ఆరోగ్య మిత్రలకు జత చేయాలి

జెసిఎస్‌ల పరిశీలనలో కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర - జామి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ అవసరమైన వారికి సంభందిత ఆరోగ్య మిత్రలను జత చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండలంలోని లొట్లపల్లిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ఓపి రిజిస్ట్రేషన్, స్పాట్ రిజిస్ట్రేషన్, ఐటి రూమ్, వైద్యుల కేటాయింపు, ల్యాబ్, మందులిచ్చే కౌంటర్, న్యూట్రిషన్ స్టాల్, కంటి పరీక్షా కేంద్రాలను ఆమె సందర్శించారు. పలువురు రోగులతో ఆమె మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడుతూ ఏడు రకాల పరీక్షలను నిర్వహించి హెల్త్ ప్రొఫైల్‌లలో వారి వివరాలను నమోదు చేయాలన్నారు. అవసరమైన వారికి కేస్ షీట్‌లను అందజేయాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున శిబిరాల వద్ద మంచినీరు, స్నాక్స్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. వచ్చిన వారిని వెంటనే పరిశీలన చేసి పంపించాలని సూచించారు. లొట్లపల్లి శిబిరంలో మొత్తం 271మందికి ఆరోగ్య తనిఖీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఎంహెచ్‌వో డా. భాస్కరరావుతోపాటు ఎంపిపి ఎస్.అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి జె. సూరిదేముడు, ఎంపిడిఓ ఎం.సతీష్, తహశీల్దార్ హేమంత్‌కుమార్, అలమండ పిహెచ్‌సీ వైద్యాధికారిణి డా. కెవిఎస్. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదు

విశాలాంధ్ర - బొబ్బిలి : టిడిపి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని పూర్తి ఆరోగ్యంతో బయటపడాలని టిడిపి మాజీమంత్రి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజయ్ కృష్ణ రంగారావు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో సర్వమత ప్రార్థనలు నిర్వ హించారు. ఈ సందర్భంగా టిడిపి మాజీ మంత్రి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజయ్ కృష్ణ రంగారావు. విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వ్యవస్థలను భయపెడుతూ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టిడిపి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై కేసులు మీద కేసులు పెట్టి తెలుగుదేశం పార్టీని అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేస్తున్న జగన్ దుర్మార్గపు చర్యలను ప్రజలు ఖండించాలని టిడిపి మాజీ మంత్రి రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజయ్ కృష్ణ రంగారావు పిలుపునిచ్చారు. 2024లో జరుగు ఎన్నికలలో ప్రజా కోర్టులో జగన్ కి శిక్ష ఖాయమని సత్యం న్యాయం చివరకు విజయం సాధిస్తుంది. జగన్ సృష్టించిన అక్రమ కేసులనుంచి చంద్రబాబు ముత్యంలా వస్తారని అన్నారు. బొబ్బిలి గొల్లపల్లి లో శ్రీ దాడితల్లి కోవెల పూజలు నిర్వహించి, అనంతరం ,కోరాడవీధి మసీదులో, ఆర్‌సిఎంచర్చ్‌లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు జైలు నుండి ఆరోగ్యంతో బయటపడాలని ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మను నాయుడు తెంటు లక్ష్మీనాయుడు. పెద్ద ఎత్తున టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ చేయడం ఎంతో అదృష్టం

విశాలాంధ్ర - కొత్తవలస : స్థానిక ఆంజనేయ పేటలో ఉన్న చైతన్య బదిరుల మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్ విజయ చంద్ర గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వికలాంగ విద్యార్థులను ఆదరించాలని వారికి సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావించాలని అన్నారు. ప్రతి ఒక్కరు వారిపై ప్రేమానురాగాలు చూపించాలని, వారి భవిష్యత్తుకు తోడ్పడాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి సంస్థను నడిపించడం చాలా కష్టమని ఇటువంటి విద్యార్థులకు సేవ చేస్తున్న సంస్థ వ్యవస్థాపకులు బోజంకి సన్యాసిరావును ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ఇటువంటి పిల్లలకు సేవ చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు కార్యక్రమంలో న్యాయవాదులు సిహెచ్ రాజారావు, డి శ్రీనివాస్, వెంకటరమణ, జివిఎస్ నాయుడు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో స్పేస్ వీక్ 2023 పోటీలలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఆక్కాన మోగిత

అభినందనలు తెలియజేసిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : ఇస్రో స్పేస్ వీక్ లో ద్వితీయ స్థానంలో నిలిచి పాఠశాలకు ఉన్నతమైన గౌరవం తీసుకొచ్చారని ప్రధానోపాధ్యాయులు డి.అప్పలనాయుడు కొనియాడారు. మంగళవారం ఇస్రో షార్ స్పేస్ వీక్ 2023 పాఠశాల స్థాయి నుండి ఉన్నత విద్య వరకు నిర్వహించిన ఇందులో ద్వితీయ,తృతీయ స్థానాల్లో సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆక్కాన యోగిత నిలిచింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అప్పలనాయుడు మాట్లాడుతూ మొన్న జరిగిన ఇస్రో 2023 ఉత్తరాంధ్ర నుంచి రఘు ఇంజనీరింగ్ కళాశాల వేదిక గా అనేక రంగాల లో పోటీ కార్యక్రమాలు నిర్వహించారు.పాఠశాల స్థాయి లో ప్రైవేట్,ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.1000 మందికి పైగా పాల్గొన్న ఈ పోటీల లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆక్యాన యోగిత క్విజ్ కాంపిటీషన్ లో ద్వితీయ స్థానం, డ్రాయింగ్ లో తృతీయ స్థానం లను సాధించిందని తెలియజేశారు.అలాగే ప్రతి ఒక్క విద్యార్థి,విద్యార్థిని కి అన్ని రంగాల్లో ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ఉన్నతమైన స్థానాలకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మన మీద ఉందని గుర్తు చేశారు.ఇంత ఘనత సాధించిన విద్యార్థిని కి పాఠశాల ప్రధనోపాధ్యాయుడు, సీనియర్ ఉపాధ్యాయులు స్టాఫ్ సెక్రెటరీ గైడ్ టీచర్ కే. వీ.సత్యనారాయణ,వనజాక్షి మరియు స్టాఫ్ మరియు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

ఎంపిడిఓ అధ్యక్షతన ఎండిఐ, పిడిఐ కమిటీ సమావేశం



విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని 2030 నాటికి పంచాయతీ రాజ్ శాఖ ద్వారా అభివృద్ధి పనులను చేయడానికి మండలలెవెల్ డేటా వెలడేషన్ కమిటీ,పంచాయతీ డెవలప్ మెంట్ఇండెక్స్ కమిటీలు ఎంపిడిఓ అధ్యక్షతన ఏర్పాటుచేస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేయగా,దీనిపై మంగళ వారంనాడు ఎంపిడిఓ కృష్ణ మహేష్ రెడ్డి మండల అధికారులతో, గ్రామపంచాయతీ కార్యదర్శులతో,సచివాలయం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. 23శాఖల అధికారుల భాగస్వామ్యం కావాలని కోరారు. మండల స్థాయిలో సభ్యులుగా తహశీల్దార్, ఏఓ, ఏఎస్ఓ, ఈఓపిఆర్డీ, హౌసింగ్ ఏఈ, ఎస్ఐ, పశువైద్యశాఖ,వైద్యశాఖ,ఐసీడీఎస్,విద్యాశాఖ, పిఆర్ ఇంజినీరింగ్, ఉపాధి, ఫారెస్ట్, విద్యుత్,వెలుగు మండల అధికారులు, బిసి, ఎస్సీ సహాయసంక్షేమశాఖల అధికారులు, హార్టికల్చర్, ఆర్ డబ్ల్యు ఎస్, ఆర్ అండ్ బి,ఇరిగేషన్ అధికారులంతా సభ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండల, గ్రామఅభివృద్ధిలో భాగంగా ఉండి పిడిఐ ద్వారా చేయనున్న పనులను నిర్ణయించి అభివృద్ధి పనులు చేయటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఈఓపిఆర్డీ వర్మ, వెలుగు ఏపిం శ్రీరాములు, ఎంఈఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో చీపుర్లతో నిరసన

విశాలాంధ్ర - బెలగాం : 10వ తారీఖు వచ్చినప్పటికీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించక పోవడం కెజిబివి సిబ్బంది, ఎస్ఎస్ఏ సిబ్బందికి జీతాలు చెల్లించక పోవడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డిఈఓ కార్యాలయం వద్ద చీపుర్లతో నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ కార్యదర్శి ఎస్. మురళీమోహన్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాలే చెల్లించక పోవడాన్ని కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నామని అన్నారు. గత 3 నెలలుగా కెజిబివి సిబ్బంది, సర్వశిక్ష అభియాన్ సిబ్బందికి జీతాలు చెల్లించలేదని, జీతాలు చెల్లించకపోతే ఎలా కుటుంబాలు గడుస్తాయని ప్రశ్నించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రమేష్ మాట్లాడుతూ రెండు సం.ల నుండి పాఠశాల నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయకపోవడం వలన వేలాది రూపాయలు హెచ్ఎంలు తమ స్వంత డబ్బులు ఖర్చు చేసారన్నారు. కావున వెంటనే స్కూల్ గ్రాంట్స్ విడుదల చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు డిఈవో కార్యాలయం ఆవరణను చీపుర్లతో శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేసారు. అనంతరం డిఈఓ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాదికారి కె. మురళి, కార్యదర్శులు ఎస్. శ్రీను, ఎం.పైడిరాజు, కె. భాస్కరరావు, గోవిందమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం మెయిన్ రోడ్డులో దొంగతనం

తాళాలు పగులగొట్టి ఎనిమిది తులాల బంగారం చోరీ



విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రం లోని సీతానగరం ప్రధాన మార్గంలో పశువుల ఆసుపత్రికి ఎదురుగా ఉండే ఇంటిలో దొంగలుపడి ఎనిమిది తులాల బంగారాన్ని దోచేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.సీతానగరం ఎస్ఐ నీలకంఠం తెలిపిన వివరాల ప్రకారం సీతానగరం గ్రామానికి చెంది తెలంగాణాలో పనిచేసి పదవీవిరమణ చేసిన ఆర్ఎస్ఐ యళ్లమహంతి వెంకటరమణ నాలుగు నెలలక్రితం తనభార్య, పాపతో కలసి హైదరాబాద్ లో ఉంటున్న పెద్దమ్మాయి దగ్గరకు వెళ్లారు. మంగళ వారం తిరిగిరాగా, బయట తలుపులకు ఉండే తాళం బద్దలుగొట్టి ఉండగా ఇంట్లోకి వెళ్లిచూడగా రెండు బీరువాలుతెరిచి ఉండటం,అందులో సుమారు ఎనిమిది తులాల వివిధ రకాల బంగారువస్తువులు లేకపోవడంతో పాటు ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడిఉన్నాయి. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నీలకంఠం తన సిబ్బందితో ముందుగా సంఘటన స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీం విచ్చేసి వేలిముద్రలను సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్వతీపురం గ్రామీణ సీఐ స్వామినాయుడు విచ్చేసి ఇంట్లో అంతా పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ, ఎస్ఐలు తెలిపారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా సరి చేయండి

ఐటిడిఎ పీవో కల్పనకుమారి

విశాలాంధ్ర- సీతంపేట : ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి చాంబర్లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం పివో కల్పనాకుమారి నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సరిచేస్తున్నామని, మీ దృష్టిలో ఇంకా ఏవైనా తప్పులు, సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఓటర్ ను ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకొంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్ధేశించుకోవాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు శ్రమను ఆయుధంగా మలుచుకుంటే విజయం మీ సొంతం అవుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతా రావు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస వద్ద చౌక ధరల దుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రం, మున్సిపల్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు స్వయంగా పదార్థాలను వడ్డించారు. స్టోర్ రూం లో సరుకుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, చెక్కిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదని, ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలని అన్నారు. విద్యార్థి దశలో వాక్పటిమ, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి విద్యా రంగం అంటే అమితమైన ప్రేమ ఉందన్నారు. పేదరికం, అనారోగ్యంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే దృఢమైన సంకల్పంతో ప్రభుత్వం అమ్మ వడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, ఉన్నత విద్యలు అభ్యసించేందుకు విదేశీ విద్యా దీవెన, జగనన్న గోరు ముద్ద వంటి బృహత్తర పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రభుత్వ పాటశాలలను కార్పొరేట్ స్కూల్ లకు ధీటుగా నాడు నేడు క్రింద అభివృద్ధి చేసి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి నాణ్యమైన విద్యతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తుందని అన్నారు. ఐక్య రాజ్య సమితి సభలో రాష్ట్రం నుండి ప్రభుత్వ పాటశాలలో చదివే విద్యార్థినీ ప్రసంగించడాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆసక్తి కలిగిన రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు క్రింద నగదు ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతకు ముందు కొత్తవలస పెద్ద వీధి లోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి జగనన్న గోరుముద్ద పథకం అమలును, సరుకుల నిల్వ, రికార్డుల నిర్వహణ ను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. వండిన వంటకాల స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంత మంది బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం, టి.హెచ్.అర్ అందిస్తున్నది వివరాలను ఆరా తీశారు. రక్తహీనత లోపం తలెత్తకుండా బలవర్ధకమైన ఆహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. పథకాల అమలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరిగేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లోపాలను సరిదిద్దుకుని ప్రభుత్వ ఆశయం నెరవేర్చేందుకు పథకాలను సమర్థ వంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే కొత్తవలస లోని చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అర్.శివ ప్రసాద్, డి ఎమ్ ఎం.దేవుళ్ళ నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్ రావు, జిల్లా మధ్యాహ్న భోజన పథకం సహాయ సంచాలకులు పి.దామోదర రావు, జిల్లా ఆహార భద్రత తనిఖీ ఇన్స్పెక్టర్ వై.రామయ్య, జిల్లా లీగల్ మెట్రాలజి ఇన్స్పెక్టర్ కె.రత్న రాజు, ప్రధానో పాధ్యాయులు జి. విశ్వం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడుకు మంచి జరగాలని దేవాలయాలలో పూజలు

విశాలాంధ్ర,పార్వతీపురం/సీతానగరం/బలిజిపేట: టీడీపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుకు సంఘీభావాన్ని తెలియజేస్తూ ఆయనకు మంచి జరగాలని కోరుతూ నియోజక వర్గంలోని మూడు మండలాల్లో, పురపాలక సంఘంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పూజలు నిర్వహించారు. నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర ఆద్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పత్రిక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తక్షణమే బెయిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, టీడీపీ నేతలు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, కొల్లి తిరుపతిరావు, పెంకి వేణుగోపాల్, బాబ్జి, రౌతు వేణుగోపాల్, గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహన్, పిఎస్ఎన్, బోను దేవిచంద్రమౌళి, డాక్టరు భానుప్రసాద్, కోలా వెంకటరావు, కోల మధుసూదన్ రావు,కోల సరిత,బడే గౌరునాయుడు, పాలకొండ రాజశేఖర్, హనుమంత శంకర్రావు,మరిశర్ల కార్తీక్ నాయుడు, కెంగువ ప్రదీప్ కుమార్, చంద్రక దేశాలు గేదెల రామారావు, రాగోలు సురేష్, గౌరజాన చంద్రమౌళి, యాండ్రాపు చినరామి నాయుడు, కోరాడ నారాయణరావు, అక్కేని శివ,రెడ్డి శివ, వడ్డీ చంటి, సాలహరి, డి. భానుప్రసాద్, బుడితి శ్రీనివాసరావు, సబ్బాన శ్రీను, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుని ఎన్నిక

విశాలాంధ్ర - పాచిపెంట : పాచిపెంట ప్రెస్ క్లబ్ అధ్యక్షుని ఎన్నిక స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. సీనియర్ పాత్రికేయులు దండి ఏడుకొండలు రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నల్లి గోవిందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో 11 మంది పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు. అధ్యక్షునిగా గోవిందరావు ఉపాధ్యక్షునిగా చిట్టూరి రమణమూర్తి కార్యదర్శిగా యజ్జిపరువు గౌరీశ్వరరావు కోశాధికారిగా పాచిపెంట ఉమామహేశ్వరరావు సంయుక్త కార్యదర్శిగా పడాల వెంకటరమణ సమన్వయకర్తగా దండి ఏడుకొండల రావులుతో పాటు మరో ఐదు మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం మండల విలేకరులు అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంచి ఆనందాన్ని పలువురుతో పంచుకున్నారు. ఈ ఎన్నిక పట్ల తోటి పాత్రికేయ మిత్రులు అభినందనలు తెలిపారు.

9, 20వ డివిజన్లలో రహదారులను ప్రారంభించిన కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 9, 20వ డివిజన్లలో ఏర్పాటు చేసిన రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. మంగళవారం ఆ డివిజన్లోని సుంకర వీధి, శాంతినగర్ వీధి, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంలో స్థానికుల వినతి మేరకు రహదారి ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఏర్పాటు అయిన రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక చొరవతో అపరిష్కృత సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు నగర స్థాయిని పెంచే విధంగా కొత్త అందాల సంతరించుకుంటున్నాయని అన్నారు. ప్రధాన రహదారుల నిర్మాణంతోపాటు జంక్షన్ల అభివృద్ధి, ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు, మంచి నీటి సౌకర్యం మెరుగుదల వంటి అనేక చర్యలు చేపట్టడం వల్ల ప్రజల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. జోనల్ ఇన్చార్జి గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. ముఖ్యంగా తాగునీటికీ ఇబ్బందులు లేకుండా వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపడుతూ కొళాయి కనెక్షన్లు మంజూరు చేశారన్నారు. రహదారులు, కాలువల ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించారని చెప్పారు. నిరంతరం మౌలిక సదుపాయాల కల్పనకు అని చూపుతున్న శ్రద్ధ అభినందనీయం అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తుంటే, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ల వీరభద్ర స్వామి అభివృద్ధి పనులు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్, జోనల్ ఇన్చార్జి అల్లు చాణిక్య, వైసీపీ నాయకులు నాయన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమ ఆయుధమైతే విజయం సొంత మౌతుంది

విశాలాంధ్ర - పార్వతీపురం/పార్వతీపురం టౌన్ : విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు శ్రమను ఆయుధంగా మలుచుకుంటే విజయం మీ సొంతం అవుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి. కాంతారావు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస వద్ద చౌక ధరల దుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రం, మున్సిపల్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు స్వయంగా పదార్థాలను వడ్డించారు. స్టోర్ రూం లో సరుకుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, చెక్కిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదని, ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలన్నారు. విద్యార్థి దశలో వాక్పటిమ, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి విద్యా రంగం అంటే అమితమైన ప్రేమ ఉందన్నారు. పేదరికం, అనారోగ్యంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే దృఢమైన సంకల్పంతో ప్రభుత్వం అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, ఉన్నత విద్యలు అభ్యసించేందుకు విదేశీ విద్యా దీవెన, జగనన్న గోరు ముద్ద వంటి బృహత్తర పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రభుత్వ పాటశాలలను కార్పొరేట్ స్కూల్ లకు ధీటుగా నాడు నేడు క్రింద అభివృద్ధి చేసి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి నాణ్యమైన విద్యతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అంది స్తుందని అన్నారు. పథకాల అమలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరిగేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లోపాలను సరిదిద్దుకుని ప్రభుత్వ ఆశయం నెరవేర్చేందుకు పథకాలను సమర్థ వంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే కొత్తవలసలోని చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి అర్. శివ ప్రసాద్, డిఎం ఎం. దేవుళ్ళ నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి. జగన్మోహన్ రావు, జిల్లా మధ్యాహ్న భోజన పథకం సహాయ సంచాలకులు పి. దామోదరరావు, జిల్లా ఆహార భద్రత తనిఖీ ఇన్స్పెక్టర్ వై. రామయ్య, జిల్లా లీగల్ మెట్రాలజి ఇన్స్పెక్టర్ కె. రత్నరాజు, ప్రధానో పాధ్యాయులు జి. విశ్వం, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై సందేహాలు తెలపాలి

విశాలాంధ్ర - గజపతినగరం : ఓటర్ జాబితా పై సందేహాలు తెలపాలని గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్ఓ వెంకటేశ్వరరావు అన్నారు మంగళవారం గజపతినగరం తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుండి డిసెంబర్ 9వ తేదీ మధ్యలో జాబితాలో మార్పులు చేర్పులు పై రాజకీయ పార్టీ నాయకులు తమ అభ్యంతరాలు తెలపాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎన్నికల ఉప తాసిల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాలంరాజుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో పూనువలస సచివాలయం పరిధిలో కాలంరాజు పేట గ్రామం ప్రాథమిక పాఠశాల ఆవరణ లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రజలకు వైద్యం నిర్వహించారు. ఈ వైద్య కార్యక్రమం లో పాల్గొన్న తహశీల్దార్ రత్నకుమార్. వైద్య అధికారులతో దగ్గరుండి ప్రజలకు కావలసిన అన్ని రకాల టెస్టులు చేయించి మందులు పంపిణీ చేశారు. సుమారు 300 మంది వరకు ప్రజలు ఈ వైద్య శిబిరంలో ఓపీలు వ్రాయించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు పూనువలస సర్పంచ్ రావిపల్లి రవణ మూర్తి దగ్గరుండి వైద్య అధికారులకు ఏమి అవసరమో అలాగే ప్రజలకు సేవలు అందు తున్నాయా లేదా అని పరి శీలించారు. అలాగే పలువురు డాక్టర్లు సచివాలయం సిబ్బంది, ఏఎన్ ఎంలు, అంగన్వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం

జియో వ్యవస్థాపకులు రామకృష్ణ



విశాలాంధ్ర - వేపాడ : గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓబలయ్యపాలెం ముత్యాలమ్మ గుడి ఆవరణలో మంగళవారం ఉదయం 14 కొబ్బరి మొక్కలను నాటారు. ఉపాధ్యాయుడు వంకధార సన్యాసి రావు పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జియో వ్యవ స్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ జన్మదినం తదితర శుభకార్యాలలో మొక్కలు నాటడం అలవాటుగా చేసుకొని తద్వారా పర్యా వరణాన్ని కాపాడవచ్చన్నారు .ప్రతి ఒక్కరూ ఈ సాంప్రదాయాన్ని ఒక అలవాటుగా చేసుకొని పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం అన్నారు. కార్యక్రమములో వాసవీ క్లబ్ వనితా జిల్లా ప్రతినిధి వి.సుశీల, హృషీకేశ్, లాస్య శ్రీ, డి.పి.చంద్ర శేఖర్, గ్రామ రెవెన్యూ అధికారి పి.శివ కృష్ణ, సి.హెచ్.శ్రీరాములు, సిమ్మ అప్పల రాము పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

విశాలాంధ్ర - వేపాడ : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డిని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,విజయనగరం జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు మంగళవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన చినరాము నాయుడును మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికి ఆరోగ్యం ఎలా ఉందని ఆరాతీశారు. విచ్చా పాటిగా కొంతసేపు మాట్లాడిన తర్వాత రాబోయే అసెంబ్లీ ఎన్నికలు పార్టీకి మనకి ఎంతో కీలకమైనవని జగన్మోహనరెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరుతూ అందుకోసం ఆయన పలు సూచనలు చేసారు. టీటీడీ చైర్మన్ ను కలిసిన వారిలో మండలంలోని నీలకంఠరాజపురం ఉప సర్పంచ్ కండిపల్లి పెదనాయుడు, వైసీపీ నాయకుడు త్రినాథ ఉన్నారు.

అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు ఆకస్మిక తనిఖీలు చేశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అలాగే పారిశుద్ధ్య పనితీరును కూడా గమనించారు. అన్ని సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. దాసన్నపేట, ప్రశాంతి నగర్, ద్వారకా నగర్, సింగపూర్ సిటీ తదితర ప్రాంతాలలో పర్యటించి అక్కడ నిర్మితమవుతున్న కాలువలు, బీటీ రోడ్ల తీరును అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాలలో జరుగుతున్న రోజువారి పారిశుధ్య పనితీరును పరిశీలించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది వస్తున్నారా లేదా అని పారిశుధ్య పర్యవేక్షకుని ప్రశ్నించారు. తడి చెత్త పొడి చెత్త వర్గీకరణ చేసి చెత్త తరలించే వాహ నాలకు అందిస్తున్నారా లేదా అని స్థానికులను అడిగారు. అన్ని సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని స్పష్టం చేసినట్లు చెప్పారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం ఉదయం తాము చేపట్టిన పర్యటనలో నాణ్యత ప్రమాణాలు సంతృప్తికరంగా ఉండడంతో అభినందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

13న వీరఘట్టంలో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర - బెలగాం : మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం వీరఘట్టం మండలంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించ వచ్చుని తెలిపారు.

ఈనెల 13న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. కేశవరావు, జేకేసీ కోఆర్డినేటర్ జి.ఈరన్న సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన 18 నుండి 30 సంవత్సరాలు గల విద్యార్థిని, విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాలు నందు హాజరు కావాలని జాబ్ మేళా కోఆర్డినేటర్ జి.ఈరన్న సూచించారు. ఈ జాబ్ మేళాకు ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్, అరబిందో ఫార్మా, సెనఫ్టిక్స్ ల్యాబ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, జయభేరి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాండ్ స్టాండ్, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, స్మార్ట్ సర్వీసెస్ వంటి ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. మరిన్ని వివరాలకు ఈ క్రింది ఫోన్ ఫోన్ నెంబర్ 7995691295 సంప్రదించాలని పేర్కొన్నారు.

మందు బాటిళ్లు పట్టుకున్న పోలీసులు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని చినబోగిలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఒక్కొక్కరి దగ్గర 18బాటిళ్లు చెప్పున 36బాటిళ్లు స్వాధీనం చేసుకుని, వారిద్దరినీ కోర్టుకు తరలించామని తెలిపారు. ఎస్ఐతో పాటు మహిళా పోలీస్ సుజాత పాల్గొన్నారు.

శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీకనక దుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం, ఆలయ వేద పండితులు ఎమ్మెల్సీ దంపతులకు వేద ఆశీర్వచనం అందజేసారు.

కారు స్కూటీ ఢీకొని వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : కారు స్కూటీ ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మునిసిపల్ బంగారమ్మ కాలనీ సుజాతనగర్ కు చెందిన కొండంగి రవికుమార్ తన ఎలక్ట్రికల్ స్కూటీపై పాచిపెంట వెళ్తుండగా సీతానగరం మండలం కాశీపేట గ్రామం దాటిన తరువాత పనుకువలస రోడ్డు కూడలి వద్ద బొబ్బిలి నుండి పార్వతీపురం వైపు వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. ఈసంఘటనలో రవికుమార్ కి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

జియ్యమ్మవలస రైతుల స్ఫూర్తితో జలకళ

జగనన్నకు చెబుదాం ద్వారా ఫలించిన రైతుల కల

విశాలాంధ్ర - పార్వతీపురం : జియ్యమ్మవలస రైతుల స్ఫూర్తితో వట్టిగెడ్డ ఎడమ కాలువ ద్వారా పంటలకు సాగునీరు లభించింది. తద్వారా పంటలు బాగా పండి రైతులకు అధిక దిగుబడి రానుంది. గతంలో సాగునీటి సమస్యపై అధికారులకు ఎన్నో దఫాలుగా అర్జీ పెట్టుకున్నప్పటికీ పరిష్కారం కాని తమ సమస్య జగనన్నకు చెబుదాం ద్వారా ఫలించిందని రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జియ్యమ్మవలస మండల రైతుల పంటలకు సాగు నీరు అందకపోవడంతో పంటలన్నీ దెబ్బతినే పరిస్థితికి చేరుకున్నాయి. ఈ తరుణంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వట్టిగెడ్డ ఎడమ కాలువ ద్వారా సాగు నీరు పంట పొలాలకు అందడంలేదని, కాలువను బాగుచేసి నీరు సరిగా అందేలా చూడాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ కు గ్రామ రైతులు అర్జీ సమర్పించారు. అర్జీపై కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రొజెక్టు ఆధునీకరణ పనులకు రూ.44.85 కోట్లు జైకా నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో ప్రొజెక్టు పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ అభివృద్ధి పనులు మరియు లైనింగ్ చేయు పనులు చేపట్టనున్నట్లు అధికారులు కలెక్టరుకు వివరించారు. అయితే జగనన్నకు చెబుదాంలో రైతులు అర్జీ సమర్పించడంతో ఈ పనులు మరింత వేగవంతం కావడంతో పంటలకు సాగునీరు లభించి రైతుల కల ఫలించినట్లు అయింది.

అండర్ 14, 17 బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్ కోట మండలం, వెంకటరమణపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానో పాధ్యాయిని ఎన్.లక్ష్మీ ఆధ్వ ర్యంలో జిల్లా స్కూల్ గేమ్స్ అసోసి యేషన్ వారి అనుమతితో ఈనెల 13వ తేదీన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాల, బాలికల బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయుడు ఇందుకూరి అశోక్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, ఆర్.జగదీశ్వరరావు, సురేంద్రలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.కోట మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ బాలురు, బాలికలు అందరూ 13వ తేదీ శుక్రవారం ఉదయం 9.00 గంటల కల్లా మైదానంలోకి క్రీడా దుస్తులతో హాజరుకావాలని, వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని కోరారు. కాగా ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు, ఉపాధ్యాయులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కంటోన్మెంట్ హైస్కూలు ప్రాంతంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 47, 48, 49 సచివాలయాల పరిధిలో ప్రజలు వైద్య శిబిరానికి చేరుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇందులో భాగమైన వైద్యానికి సంబంధించి ఇప్పటికే అనేక రకాల సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. నగరంలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి రుజువు చేస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం అందరి అదృష్టమని అన్నారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం కేజీహెచ్ అంతటి ప్రభావాన్ని సంతరించుకోనున్నట్లు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే ప్రజల మౌలిక సదుపాయాలు కల్పనకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తాగునీటి సమస్యను లేకుండా అవసరమైన వారికి ఇంటింటి కులాయిలను అందజేసారని గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలందరూ మరోసారి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ప్రాథమిక అంశాలన్నింటిని నెరవేర్చుతూ నూతన పాలనా విధానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా గత నెల వరకు జగనన్న సురక్ష పేరిట ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, భద్రతకు వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తూ శస్త్ర చికిత్సలు చేయడానికి కూడా అవకాశం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు,సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జి దూబే, డివిజన్ల కార్పొరేటర్లు సుంకరి నారాయణస్వామి, ధనలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు రహీం, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చీడ పీడల నివారణకు పలు పత్ర కషాయం మేలు

ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ

విశాలాంధ్ర - వేపాడ : వరి పొలంలో పోషక లోపాల నివారణకు,చీడపీడలు నివారించడానికి పలు పత్ర కషాయం ఎంతగానో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కె. సన్యాసమ్మ అన్నారు. పలు పత్రాలు మన ప్రాంతంలో దొరికే 15 నుండి 20 రకాల ఆకులను, పుష్పాలను రెండు కేజీలు చొప్పున తీసుకొని 200 లీటర్ల నీటిలో వాటిని మెత్తగా గ్రైండ్ చేసి నీటిలో కలిపి వారం రోజులు పాటు మురగ పెట్టాలన్నారు. అలా మురగపెట్టిన ద్రావకాన్ని ఒక ఒక స్పేయర్ నీళ్లలో రెండు లీటర్ల పలు పత్ర కషాయాన్ని కలిపి పంట పైన పిచికారి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఇప్పటి వరకు మండలంలోని కడకొండ, చినదుంగాడ గిరిజన గ్రామాల్లో రైతులతో నవదాన్యలు, ద్రవ జీవామృతం, ద్రావణాలు, కషాయాలు తయారు చేయించి పూర్తి స్థాయిలో పంటల చీడపీడలు గుర్తించి నివారించడం జరుగుతోందన్నారు. గిరిజన గ్రామాల్లో కూడా వ్యవసాయ ఖర్చులు తగ్గించి దిగుబడిని పెంచాలని ఉద్దేశంతో ఈ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని పరిచయం చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చేయడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి కావలసిన వనరులు అన్ని గిరిజన గ్రామాల్లో సమృద్ధిగా దొరకడం వలన రైతులు మరింత ఉత్సాహంతో ముందుకు వస్తున్నారన్నారు. ప్రస్తుతం వరి పంట పైన రైతులకు ప్రకృతి వ్యవసాయాన్ని చేసేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో మంగళ వారం జగనన్న అరోగ్య సురక్ష కార్యక్రమం జరిగినది. శిబిరం ద్వారా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు,వైద్యులు కోరారు. పెదంకలం,సీతానగరం పిహెచ్‌సి వైద్యులు రాధాకాంత్, శిరీష, ఉషారాణి ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు అప్పారావు, శ్రీరేఖ తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు.కంటి తనిఖీలు కూడా నిర్వహించారు.అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మహేష్ రెడ్డి, పరిపాలన అధికారి ప్రసాద్, ఈఓపి ఆర్డీ వర్మ, ఎంఈఓ సూరిదేముడు, సిహెచ్ఓ సూర్యనారాయణ, సర్పంచ్ సత్యవతి, సచివాలయం సిబ్బందితో పాటు వివిధ సచివాలయంల సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. వైద్య సేవలు, వివిధ కౌంటర్ల ఏర్పాటు, వివిధ రకాల సేవలు పట్ల ప్రజలు, రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు గుచ్చిమిలో : బుదవారంనాడు గుచ్చిమి గ్రామ సచివాలయంలో బుదవారంనాడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు.

ఎస్.కోట శియోను క్రీస్తు మందిరంలో ప్రార్ధనలు చేసిన నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట పట్టణం శ్రీనివాస కాలనీలోని శియోను క్రీస్తు ప్రార్థనా మందిరంలో క్రిస్టియన్ మతబోధకులు రేవ.ఎన్.భూషణం పాస్టర్ ద్వారా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో మంగళవారం నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి చంద్రబాబు, నారా వారి కుటుంబ సభ్యుల పేరు మీదుగా మంగళవారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మనోధైర్యంతో కూడిన సంపూర్ణ ఆయురా రోగ్యాలు చేకూరాలని, శత్రుశేష మూకలు నుండి కాపాడాలని, వైసీపీ ప్రభుత్వ అరాచకపాలన నుండి రాష్ట్ర ప్రజలను రక్షించి కాపాడాలని కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే లలితకుమారి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి భీశెట్టి అరుణ, ఎస్.కోట మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కోనదం మల్లేశ్వరరావు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, క్లస్టర్ కోఆర్డినేటర్ విశాఖ టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, యువత పెదగాడి రాజు, ఎస్.టి.ఆర్, హైటెక్ సురేష్, వీరభద్రరావు (తోమస్), సిండికేట్ సుబ్బారావు, వసంత వెంకటరమణ, ఆలుగుబిల్లి సొంగ కృష్ణారావు, పొలిమేర లక్ష్మి, ముసిరాన ఝాన్సీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష - పేదలకు వరం : ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు

విశాలాంధ్ర - వేపాడ : ప్రజా ఆరోగ్య రక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం అని మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు అన్నారు. మండలంలోని దబ్బిరాజుపేట గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సతీష్ మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటే ఆర్థికంగా బలపడినట్లేనని సీఎం భావించి దేశంలోఎక్కడా లేనివిధంగా ప్రజల ముంగిటే వైద్య శిభిరాలను ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తిత్వం గల మనిషిగా ప్రజల హృదయాలలో నిలిచి పోయారన్నారు. ఈ వైద్యశిభిరాలలో రోగుల సౌకర్యార్థం సహాయక కేంద్రం, స్పాట్ సర్వే కౌంటర్, రోగుల నమోదు కేంద్రం, అత్యవసర స్టాల్, ల్యాబ్ పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ, ఐదుమంది డాక్టర్ల వేర్వేరు కేంద్రాలు, ప్రత్యేక కంటి పరీక్షల కేంద్రం, రోగుల కోసం ప్రత్యేకంగా టాయలెట్స్ ఏర్పాటు వంటి అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం ఈ వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచినందున ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీపీ కోరారు. కాగా ఈ వైద్యశిభిరంలో సుమారు 405 మంది వరకు రోగులు హాజరై వైద్య నిపుణులచే చికిత్సలు పొంది ఉచితంగా మందులు కూడా తీసుకున్నారు. దబ్బిరాజు పేట,చామలపల్లి సర్పంచులు, దండుపాటి ముత్యాలమ్మ కోలా సతీష్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో జడ్పీటీసీలు శానాపతి అప్పారావు,వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ చామంతుల లక్ష్మి, సోంపురం ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ, ఎంపీడీఓ పట్నాయక్, తహసీల్దార్ ప్రసన్నకుమార్, బొద్దాం పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ కే అజయ్ కుమార్, సిహెచ్ఓ ఆంజనేయులు, వైద్య బృందం,ఐసీడిఎస్ సూపెర్వైజర్ కామేశ్వరి, పంచాయతీ కార్యదర్శి తాడి ధనలక్ష్మి, భారతి, వీఆర్వో డి.ప్రసాద్ ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామ పెద్దలు చామంతులు గంగాధర్, దండుపాటి సత్తిబాబు, చింతల రమణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగర అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రంలో చేపడుతున్న వివిధ పనులను ఏపీ శాసనసభ ఉపసభాపతి, స్థానిక శాసన సభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి మంగళ వారం పరిశీలించారు. కంటోన్మెంట్, మయూరి కూడలి వద్ద జరుగుతున్న రహదారులు, డివైడర్లు, ఇతర పనులను పరిశీలించిన ఆయన.. సంబంధిత అధికారులకు, గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, నాణ్యత ఉండేలా చూడాలని సూచించారు. పనులు చేపట్టేటప్పుడు ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సుంకర వీధి వద్ద రహదారి మార్గంలో చిన్న చిన్న ప్యాచ్ వర్క్ లు మిగిలి ఉండటంపై వెంటనే సంబంధిత అధికారులు, గుత్తేదారులతో ఆయన ఫోన్లో మాట్లాడారు. ఎక్కడా అసంపూర్తిగా పనులు విడిచి పెట్టవద్దని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మంచినీటి కుళాయిల సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా.. మూడు రోజుల్లో పరిష్క రించాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే చంద్రబాబు అక్రమ అరెస్ట్

విశాలాంధ్ర - చీపురుపల్లి : ఎన్నికలలో ఓటమి భయంతోనే చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని చీపురుపల్లి నియోజకవర్గం టిడిపి నాయకులు పైల్ బలరాం, దన్నాన రామ చంద్రుడు, సారేపాక సురేష్ బాబు,తాడ్డే సన్యాసి నాయుడు అన్నారు. చీపురుపల్లిలో మంగళవారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో చంద్రబాబు కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తే, మూడు ఎమ్మెల్సీలు కూడా టిడిపి అభ్యర్థులు గెలవడం జరిగిందన్నారు. సాధారణ ఎన్నికలు కూడా తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలవబోతున్నారని అన్నారు. ఇది జీర్ణించుకోలేక జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడు గారి అరెస్ట్ చేయడం జరిగింది అన్నారు. అక్రమంగా ఎన్ని కేసులు పెట్టినప్పటికీ కడిగిన ముత్యం వలె చంద్రబాబు బయటకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహంతి అప్పలనాయుడు,మహంతి రమణ మూర్తి, యజ్జిపరపు సత్యం,దన్నాన సూరప నాయుడు, మొగశాల రమేష్, కెల్ల రామరావు, గడే సన్యాసప్పల నాయుడు, గంట్యాడ సత్యనారాయణ, మీసాల నవీన్,శ్రీధర్, కాశీ, హారతి సాహూ, సబ్బి సోనియా, రేగిడి వాసు,పిన్నింటి సన్యాసి నాయుడు, మండల అప్పలనాయుడు, చల్ల శ్రీరామ్, వరపల శంకర్, లెంక లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి ఆటంకాలు తొలగిపోవాలని శ్రీదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆదేశాలు మేరకు నారా చంద్రబాబు నాయుడు - లోకేష్ కుటుంబానికి ఆటంకాలు తొలిగిపోవాలని ఎస్.కోటలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకి నిరసనగా మంగళవారం విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, ఆలుగుబిల్లి ఎంపీటీసీ రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శృంగవరపుకోట నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు నాయుడు త్వరలో విడుదల కావాలని, సుప్రీంకోర్టులో న్యాయం జరగాలని దుర్గాదేవి అమ్మవారిని వేడుకున్నారు. మా అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ బాబు కుటుంబానికి తలెత్తిన

ఆటంకాలు తొలగిపోయి సత్వరమే కేసులు నుంచి బయట పడాలని, వారి కుటుంబం యోగ క్షేమాలతో, ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని వేడుకున్నామని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. అనంతరం ఎస్.కోటలోని ఆకుల డిపో వద్ద గొంప క్రిష్ణ ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం వద్ద చిడతలు చేస్తూ నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లగుడు రవికుమార్ (జామి టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు), రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), బండారు పెదబాబు (జామి మండలం మాజీ జడ్పీటీసీ), గుమ్మడి భారతి (నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు), ఇప్పాక త్రివేణి (జామి మేజర్ పంచాయతి మాజీ సర్పంచ్), జుత్తాడ రామసత్యం (మండల పార్టీ సెక్రటరీ), మాదిబోయిన మంగరాజు గారు (ఎస్.కోట టౌన్ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు), ఆడారి ఉమామహేశ్వరరావు (గోపాలపల్లి సర్పంచ్), గనివాడ సన్యాసినాయుడు (వినాయకపల్లి సర్పంచ్), కోరుకొండ శ్రీనివాసరావు (వసి మాజీ సర్పంచ్), మండా త్రినాథ్ (మామిడిపల్లి పార్టీ ప్రెసిడెంట్), సేనాపతి గణేష్ (ఐటీడీపీ అధ్యక్షులు వేపాడ మండలం), ఇందుకూరి శ్రీనిరాజు(రాజీపేట), ఆలుగుబిల్లి గ్రామ తెలుగుదేశం సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను బొబ్బిలి సబ్ డివిజనల్ డి.ఎస్.పి శ్రీధర్

విశాలాంధ్ర - రామభద్రపురం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను బొబ్బిలి సబ్ డివిజనల్ డి.ఎస్.పి శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, రికార్డులను, లాకప్ గది, రికార్డుల భద్రపరిచిన గది, కంప్యూటర్ రూము ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతోమాట్లాడారు. సబ్ డివిజనల్ పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని అన్నారు. రామభద్రపురం జంక్షన్ కావడంతో నిత్యం వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతుండడం వలన వాటిని ఏ విధంగా నియంత్రించాలో స్థానిక ఎస్సై సురేంద్ర నాయుడుకు ప్రమాదాలు జరిగే ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయమని కోరమని అన్నారు. నిత్యం వాహన తనిఖీలు డ్రంక్ అండ్

డ్రైవ్ వంటివి చేపట్టడం జరుగుతుందని అన్నారు. బైపాస్ జంక్షన్ నుంచి బొబ్బిలి రోడ్డు వరకు రహదారి విస్తరణ చేస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని అన్నారు. స్థానికులు కూడా విస్తరణకు సహకరిస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని అన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వాహనాలను బైపాస్ లో ఉన్న చెక్ పోస్ట్ వద్ద నిరంతరం తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. పోలీసులు కూడా గ్రామాల్లో తిరుగుతూ ఫ్రెండ్లీ పోలిస్, విజిబుల్ పోలిస్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఒడిస్సా నుంచి గంజాయి అక్రమంగా ఆంధ్రకు తరలకుండా చెక్ పోస్ట్ వద్దగట్టిగా నిగ్రహ హేర్పాటు చేశామని అన్నారు. ఈ మధ్యకాలంలో గంజాయి అక్రమణ కూడా బాగా తగ్గిందని తెలిపారు. అలాగే క్రైమ్ రేటు కూడా బాగా తగ్గిందని అన్నారు. అలాగే హైవే వద్ద బ్రిడ్జి బాగా లేకపోవడం వలన అటు గ వచ్చే వాహనాలను బ్రిడ్జి పైపు వెళ్లకుండా వేరే దారిలో మళ్లి స్తున్నామని అన్నారు. అలాగే ఎస్ఐ సురేంద్ర నాయుడు సొంత నిధులతో స్టేషన్ పైభాగం వర్షం కారణంగా కారిపోవడంతో వేయించి, భవనం మొత్తం రంగులు వేయించడం జరిగిందని అన్నారు. ఈ విషయంలో ఎస్ఐను ప్రత్యేకంగా అభినంది స్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమలరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఒరిజినల్ మార్కుల లిస్టులు కళాశాలలో పొందవచ్చు

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ను మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షలు మరియు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు 2023 లో పాసైన విద్యార్థిని, విద్యార్థులు తమ ఒరిజినల్ మార్కుల లిస్టులు కళాశాలలో పొందవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ జి. రామారావు తెలియజేశారు. కావున విద్యార్థిని, విద్యార్థులు త్వరగా వచ్చి కళాశాలలో ఒరిజినల్ మార్కుల లిస్టులు తీసుకోవాల్సిందిగా తెలియజేశారు.

రామతీర్థంలో సుందరకాండ పారాయణం

విశాలాంధ్ర - నెల్లిమర్ల : పవిత్ర పుణ్య క్షేత్రం రామతీర్థంలో స్వామివారి పవిత్రోత్సవాల సందర్భంగా మంగళవారం 40 మంది రుత్విజులతో సుందరకాండ పారాయణం నిర్వహించారు. ముందుగా ప్రాతఃకాలార్చన బాలభోగం నిర్వహించారు. అలాగే ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం, తమలపాకులు, సింధూరంతో అర్చన చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వ హించారు. అనంతరం ఆస్థాన మండపంలో విశ్వక్సే నారాధన, పుణ్యాహవచనం చేపట్టారు. కార్యక్రమంలో పాంచరాత్ర ఆగమ సలహాదారు రంగనాథాచార్యులు వైదిక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఇఒ కిషోర్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్వీన్స్ ఎన్నారై ఆసుపత్రిలో కేన్సర్ చికిత్సలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : క్వీన్స్ ఎన్నారై ఆసుపత్రి ఆధ్వర్యంలోని కేన్సర్ వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు హాస్పిటల్ ఎండి డి. రమేష్ అన్నారు. మంగళవారం క్వీన్స్ ఎన్నారై ఆసుపత్రి 6వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో అందిస్తున్నామన్నారు. కార్డియాలజీ, ఆర్థో, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గైనిక్ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎండోస్కోపీ, ల్యాపరోస్కోపీ విధానం ద్వారా కుట్లు, పెద్ద కోత లేకుండా అత్యాధునిక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా న్యూరో కి సంబంధించి సర్జికల్ విధానాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే అతి తక్కువ కాలంలో తమ ఆసుపత్రి మంచి పేరు సంపాదించడం జరిగిందన్నారు. కావున ఈ వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - మెంటాడ : అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై బాలికలను నివృత్తి పరిచారు మండలంలోని ఆగూరు గ్రామంలో ఎంపిడిఓ పి త్రివిక్రమరావు ఎంఇఓలు కె.మోహన్‌రావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపట్టారు. విద్యార్థులు తల్లిదండ్రులు గర్వపడేలా చక్కగా చదివి విద్యార్థులకు పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఎంఈఓ మోహన్ రావు తెలిపారు యూనిఫామ్ నైపుణ్యాలతో కూడిన విద్యార్థులు నా జీవితాన్ని నేను చక్కదిద్దుకుని వరకు పెళ్ళికి దూరంగా ఉంటానని శారీరక సంపూర్ణ మానసిక ప్రశాంతతో కలిగిన సక్రమ వృత్తులలో స్థిరపడి న 18 ఏళ్లు నిండిన తరువాతనే పెండ్లి చేసు కుంటానని ప్రతిజ్ఞ విద్యార్థులు చేపడడం జరిగినది ఈ ప్రతిజ్ఞ జయతి చల్లపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సెసిడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు తొందరగా విడుదల చేయాలి

విశాలాంధ్ర - మెంటాడ : మంగళవారం మండల టిడిపి పార్టీ ఆధ్వర్యంలో మెంటాడ శ్రీ శ్రీ కన్యకా పరమేశ్వరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.బాబుతో మేము కార్యక్రమం లో మండలపార్టీ అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, రాష్ట్ర అధికార ప్రతినిధులు గెద్ద అన్నవరం,గొర్ల మురళి నాయుడు, పార్టీ నేతలు చదరాన రాములునాయుడు,గెద్ద కాశి నాయుడు, గుమ్మడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో శ్రీదారగంగమ్మ, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట గ్రామ ఇలవేల్పు, కోరిన కోరికలను తీర్చే అమ్మవారిగా పేరుగాంచిన శ్రీదారగంగమ్మ అమ్మవారిని శృంగవరపుకోట నియోజకవర్గ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి, ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారిని దర్శించుకుని చంద్రబాబు, నారా వారి కుటుంబసభ్యులు పేరు మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మనోధైర్యంతో కూడిన సంపూర్ణ ఆయురారోగ్యాలను చేకూరాలని, శత్రుశేష మూకలు నుండి కాపాడాలని, వైసీపీ ప్రభుత్వ అరాచకపాలన నుండి రాష్ట్ర ప్రజలను రక్షించి కాపాడాలని కోరుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే లలితకుమారి వెల్లడించారు. అడేవిధంగా రాజ్యాంగంమీద, న్యాయస్థానం మీద పూర్తి నమ్మకం ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. న్యాయస్థానంలో న్యాయం, ధర్మం ఖచ్చితంగా గెలుస్తుందని మాకు నమ్మకం ఉందని, మా నాయకుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి భీశెట్టి అరుణ, ఎస్.కోట మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కొనడం మల్లేశ్వరరావు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, క్లస్టర్ కోఆర్డినేటర్ %c% విశాఖ టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాస, నాయకులు పెదిరెడ్డి రాజు, ఎస్.టి.ఆర్, హైటెక్ సురేష్, సిండికేట్ సుబ్బారావు, వసంత వెంకటరమణ, ఆలుగుబిల్లి సాంగ కృష్ణారావు, పాలిమేర లక్ష్మి, మునిరాం రుణ్నీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

గర్భిణీలకు భోజన ఏర్పాట్లు చేయడం ఎంతో సంతోషదాయకం

జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. వనజ

విశాలాంధ్ర - జామి : ప్రతీ నెలా ఆసుపత్రికి ఆరోగ్య తనిఖీల నిమిత్తం వచ్చే గర్భిణీలకు మధ్యాహ్న సమయంలో భోజనం ఎంతో అవసరమని, అటువంటిది ఇప్పటి నుండి ప్రతీ నెలా దాతల సహకారంతో భోజ ఏర్పాట్లు చేయడం ఎంతో సంతోషదాయకమని జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. వనజ అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో పిఎంఎస్ఎంఎ లో భాగంగా గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు జరిగాయి. గర్భిణీలకు, వారి సహాయకులకు, ఆసుపత్రి సిబ్బందికి దాదాపు 130మందికి విద్యుత్‌శాఖలో జెఇగా పనిచేస్తున్న లగుడు ఆదిత్య, మౌనిక దంపతులు భోజనాన్ని ఏర్పాటు చేసారు. ఆదిత్య తండ్రి సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఈవిధంగా చేసినట్లుగా తెలిపారు. ఈకార్యక్రమంలో ఆదిత్య అత్తమామలు జగదప్ప సత్తిబాబు, సత్యవతి, జామి హైస్కూల్ కమిటీ చైర్మన్ జగదప్ప మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాలతోనే ఆరోగ్యం : ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు

విశాలాంధ్ర - వేపాడ : పౌష్టికాహారాలతోనే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని మండల పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు అన్నారు. మంగళవారం మండలంలోని దబ్బిరాజుపేట సచివాలయం పరిధిలో ప్రజా ఆరోగ్య కోసం ప్రభుత్వ రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఐసిడిఎస్ అధికారుల సూచనల మేరకు ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ కార్యకర్తలు ఎస్ ఎ జ్యోతి, ఎంఎస్ దేముడమ్మ, బి సూరకర్త్రం, జె.లక్ష్మిలు, ఏర్పాటు చేసిన పౌష్టికాహారాలతో కూడిన శిబిరంను సందర్శించి పౌష్టికాహారాల రుచులను ఆయనతోపాటు జడ్పీటీసీ శానాపతి అప్పలనాయుడులు ఆరగించి అంగన్వాడీ కార్యకర్తలను ప్రశంసించారు. అంగన్వాడీ కార్యకర్తలు సుమారు 20 రకాల వంటకాలతో పోషకాలతో కూడిన ఆహారాలను, రుచికరంగా తయారుచేసి ప్రదర్శించారు. వాటిని ఆకట్టుకేసి వచ్చిన ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్తులు రుచి చూశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అదపా ఈశ్వర్ రావు దబ్బిరాజుపేట చామలపల్లి సర్పంచులు దండుపాటి ముత్యాలమ్మ కోలా సత్తిబాబులతో పాటు ఎంపీటీసీ చామంతుల లక్ష్మి, సోంపురం ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ గ్రామ పెద్దలు చామంతుల గంగాధర్ దండుపాటి సత్తిబాబు, చింతల రమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ జి. కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగులకు నిరంతరం వైద్యసేవలు

విశాలాంధ్ర - నెల్లిమర్ల : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా దీర్ఘకాలిక రోగులకు నిరంతరం వైద్యసేవలు అందుతాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నెల్లిమర్ల మండలం బూరాడపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దక్కుతుందని చెప్పారు. వైద్య ఆరోగ్య రంగంలో సమూల మార్పులు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబల్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎంపీడీఓ జి రామారావు, తహశీల్దార్ ధర్మరాజు ఎంపీటీసీ జగన్నాథం, నాయకులు దంతులూరి గిరిబాబు, బెల్లాన రామారావు, మిక్కిన వెంకటరమణ పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక కోట జంక్షన్ వద్ద ఉన్న విజయ బ్లడ్ బ్యాంకులో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ పీవీజీ ఆబ్దుల్ కలాం జయంతి వార్షికోత్సవాల సందర్భంగా విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో రక్తనిధి కేంద్రాలలో రక్త నిల్వలు కొరత దృష్ట్యా, అదేవిధంగా తలసేమియా పిల్లలు మరియు గర్భిణీ స్త్రీల రక్త కొరత కారణంగా శిబిరాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇబ్రహం తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి 62 మంది రక్తదానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాప్స్ శరత్, రాము, రఘు, కళ్యాణ్, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ శేఖ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులు పెట్టి నిర్బంధాలు చేస్తున్న కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పండి

విశాలాంధ్ర - బొబ్బిలి : కేంద్రంలో రాష్ట్రంలో జర్నలిస్టులు, రచయితలు, కవులు, కళాకారులు పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న నిరంకుశ విధానాల పైన అక్రమ కేసులు, సోదాలపై ప్రజలు ప్రజాసంఘాల మేధావులు ఐక్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ బొబ్బిలిలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.ఢిల్లీలో ఈ మధ్యకాలంలో రైతులు, మహిళా సంఘాలు, కార్మిక సంఘాలు పోరాటాలను దేశ ప్రజానీకానికి తెలియజేశారని, మణిపూర్ హింసలో ఉదాసీనతకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కారణమని ప్రపంచానికి తెలియజేసిన న్యూస్ క్లిక్ జర్నలిస్టుల పైన ఉపా చట్టాన్ని మోపి జైల్లో పెట్టడాన్ని సిపిఐయు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు ఖండించారు. మంగళవారం పట్టణంలో కోర్టు వీధి సెంటర్లో నిరసన తెలియజేస్తూ బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నది. ప్రతిపక్ష పార్టీలను సైతం తప్పుడు కేసులు బనాయించి లొంగదీసుకుంటున్నది. అని అన్నారు. పాలకులు చేస్తున్న తప్పులను ప్రశ్నించేవారిని దేశద్రోహం, ఉపా కేసులు, జైలుకు పంపిస్తున్నది. జిల్లా కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం అని అన్నారు. బిజెపి దుర్మార్గాన్ని ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి. యుగంధర్ జి. గౌరీ జి. శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

కస్తూరిబా గాంధీ విద్యాలయానికి తాగునీటి సమస్య

చెక్ చైర్మన్ కృష్ణ వేణి

విశాలాంధ్ర - మెంటాడ : నాలుగు రోజులుగా కస్తూరిబా గాంధీ విద్యాలయంలో తాగునీటి సమస్య నెలకొంది. విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను చెక్ చైర్మన్ సిహెచ్ కృష్ణ వేణి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలోని ట్యాంక్ మోటార్ మరమ్మతులకు గురికావడంతో పాఠశాల యాజమాన్యం దొరవ తీసుకోకపోవడం పలువురు ఆరోపించారు. ఈ విషయంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, తహశీల్దార్ రామకృష్ణ కు అధనపు మోటార్ కొనుగోలు చేసి రిజర్వ్ లో వుంచేలా ఉండాలని సిపిఎం పార్టీ మండల శాఖ కార్యదర్శి రాకోటి రాములు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సిహెచ్ కృష్ణ కృష్ణలు కోరారు.

పేద ప్రజలకు వరం. జగనన్న ఆరోగ్య సురక్షిత

విశాలాంధ్ర - మెంటాడ : జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజల పాలిట వరముగా మారిందని వైసిపిఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు పాతల ప్రసాద్ అన్నారు మండలంలోని ఆగూరు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఆగూరు గర్ల గ్రామాల సర్పంచులు ఆకుల శివ బొడ్డు సత్యవతి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగినది భవిష్యత్తులో రోగాలు నుండి విముక్తిని పొందేందుకు ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందని ఈ కార్యక్రమంలో సుమారు 500 మందిని పాల్గొని వైద్య సేవలు పొందారని ప్రసాద్ తెలిపారు ప్రతి ఒక్కరు శిబిరాలను వినియోగించి ఆరోగ్యంగా ఉండాలని రోగాలు దరిచేరని శర్మాలా బాధపడే కంటే ముందస్తుగా వైద్యులు సూచించిన మేరకు మందులు వాడుకోవాలని ఈ సందర్భంగా సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు డాక్టర్లు జీలాన్ భాష లోకప్రియ ఎంపిటిసి సిద్ధల లక్ష్మి గ్రామ వైస్ సర్పంచ్ బెంటు ముత్యాల నాయుడు సిహెచ్ సత్యనారాయణ అంగన్వాడీ సూపర్వైజర్ రమా మాలిని తెలుగు ఏపీఎం సత్యనారాయణ సిపి అప్పలనాయుడు పీఆర్వో శీల వైసిపి నాయకులు పల్లె అప్పలనాయుడు పూర్ణిన అప్పలనాయుడు గ్రామ సచివాలయం వలంటీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురంలో బాబుతో నేను

విశాలాంధ్ర - భోగాపురం : మండల కేంద్రమైన భోగాపురం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఇంటింటికి చైతన్య కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం వైసిపి హయాంలో విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బొద్ద హరిబాబు, తిరుపతి, సంగం అప్పలసూరి, లెంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలి

వామపక్షాలు, లోక్‌సత్తా, కాంగ్రెస్ పార్టీ లో నేతలు డిమాండ్

విశాలాంధ్ర - బొబ్బిలి : నియోజకవర్గ పరిధి రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న గతంలో పశు వులాస్పత్రి ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన ప్రభుత్వ స్థలం సుమారు 52 సెంట్లు భూమి కోట్లాది రూపాయలు విలువ చేసిన భూమి తప్పుడు పద్ధతుల్లో రికార్డులు సృష్టించి వైసిపి నాయకులు అమ్ముకుంటున్నారని సంబంధిత అధికారులు నెమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని అందుకు నిరసనగా గతంలో ఈ భూమిపై భూకబ్జాల మీద అన్ని రాజకీయ పార్టీలు ఆందోళన చేసామని అయినా అధికారుల్లో స్పందన రాలేదని తక్షణమే సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని వామపక్ష లోక్‌సత్తా కాంగ్రెస్ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇదివరకే జనసేన పార్టీ నాయకులు ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని పరిశీలించడానికి వెళ్లడం అక్రమంపైన ఆందోళన చేసి అడ్డుకుంటుండగా ఖండించిందని జనసేన నాయకుడు ధనుంజయ్ పై వైసిపి నాయకులు దాడికి వెళ్లి దాడి చేయడానికి జ్వరంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించు కోవడమే కాక ప్రశ్నించే వాళ్ళపై దాడి చేయడాని మేము తీవ్రం గా ఖండించారు. ప్రజాస్వామ్యంలో పాలకులు ఇటువంటి చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి రామభద్రపురం కూరగాయల మార్కెట్‌కు లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరుస్తున్న రైతులు అవసరాలకు కోల్డ్ స్టోరేజ్, రెస్ట్ హౌస్ లాంటివి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ భూమి ఎటువంటి కొనుగోలు జరిగిన మేము అడ్డుకుంటామని అవ సరమైతే పెద్ద పోరాటానికి సిద్ధ మవుతామని పాప కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పినిని నెందుర మువ్వల శ్రీనివాసరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి పి శంకర్రావు లోక్ సత్తా స్టీరింగ్ కమిటీ నాయకు లు ఆకుల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థను పటిష్టపరచాలి : కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలోని సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డిసిడిసి), జిల్లా స్థాయి అమలు కమిటీ (డిఎల్ఐసి), పిఏసిఎస్ కంప్యూటరైజేషన్ అమలు, మానిటరింగ్ కమిటీ సమావేశాలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం వరుసగా జరిగాయి. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, సహకార సంఘాలను బలోపేతం చేసి, వాటి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని సంఘాల కార్యకలాపాలు నామమాత్రంగా ఉన్నాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలను వినియోగించుకొని వాటి పరిధిని, కార్యకలాపాలను పెంచాలని సూచించారు. ఆయా సంఘాల దృక్పథంలో మార్పును తీసుకువచ్చి, ఇతర రంగాలపై అడుగుపెట్టేలా నడిపించాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఏర్పాటైన సహకార సంఘాల కార్యకలాపాలపై ఆరా తీశారు. సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిని వెర్బేర్, పశు సంవర్ధకశాఖ పరిధిలోని సంఘాల కంప్యూటర్ ప్రక్రియను కూడా వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. గోదాముల నిర్మాణంపై దృష్టి పెట్టి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జన జౌషధి కేంద్రాలు, పెట్రోలు బంకుల నిర్వహణపై ఆరా తీశారు. అన్ని సొసైటీలకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. జిల్లా సహకార అధికారి వి.రమేష్ మాట్లాడుతూ, ఈ మూడు కమిటీల కార్యకలాపాలను, ఆయా కమిటీల్లోని సభ్యుల పాత్రను వివరించారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి అయ్యిందని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిపిఓ నిర్మలాదేవి, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, పశు సంవర్ధకశాఖ డిడి వైవి రమణ, మత్స్యశాఖ డిడి నిర్మల కుమారి, మత్స్యకార ఫెడరేషన్ ప్రతినిధి ఐర్ల విన్సెన్సన్, నాబార్డ్ డిడిఎం నాగార్జున, నిబిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి, డిసిఎంఎస్ మేనేజర్ రమేష్, డిసిసిబి సిఇఓ, ఇంజినీరింగ్ అధికారులు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్/బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు దిశ డిఎస్పీ ఎస్.ఆర్. హర్షిత యొక్క సిబ్బందితో కలసి మంగళవారం పార్వతీపురం పట్టణంలోని శ్రీ కృష్ణా పబ్లిక్ స్కూల్ లోని చదువుతున్న బాల, బాలికలకు పోక్సో చట్టాలు, దిశ యాప్, మంచి స్పర్శ, సైబర్ నేరాలు, పిల్లల నడవడిక మీద తల్లిదండ్రులు తీసుకోవాల్సిన ప్రత్యేక శ్రద్ధ తదితర అంశాలపైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా దిఎస్పీ హర్షిత మాట్లాడుతూ పోక్సో చట్టాలు అనేవి బాలికలకే కాకుండా బాలురకు కూడా వర్తిస్తాయని, పిల్లలు ఎక్కువగా ఆన్లైన్ గేమ్స్ కు అలవాటుపడుతున్నారని దానివలన అనేక దుష్పరిణామాలు ఎదుర్కొంటున్నారన్నారు. అందువలన తల్లిదండ్రులు వారి మీద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారికి తగిన సమయాన్ని కేటాయించి వారిని ఒంటరిగా ఉండనివ్వకూడదని అదే విధంగా పిల్లలకు ఎక్కడికి వెళ్లిన ఏమి చేసిన వారి తల్లిదండ్రులకు గాని, సంరక్షకులకు గాని సమాచారాన్ని తెలియజేయాలని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికను పర్యవేక్షిస్తూ ఫుండాలని సూచించారు. దిశ యాప్, సైబర్ నేరాలు, మహిళలకు ఉపయోగపడే చట్టాలు మహిళలపై జరుగుతున్న నేరాలు దృష్ట్యా వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియచేశారు. ముఖ్యంగా వాడే సెల్ ఫోన్లలో దిశ (ఎస్ఒఎస్) యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని చెప్పి వాటివల్ల కలిగే ప్రయోజనాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లావణ్య, హెడ్ కానిస్టేబుల్ పి. లావణ్య, స్కూల్ అధ్యాపకబృందం తదితరులు పాల్గొన్నారు.

'ప్రాణం తీసిన పసరు వైద్యం' కథనం పై స్పందన

విశాలాంధ్ర - కురుపాం : విశాలాంధ్ర పేపర్‌లో ప్రచురించిన "ప్రాణం తీసిన పసరు వైద్యం" కథనం పై స్పందించిన మన్యం జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు మంగళవారం తనఖ్ఖండంలో పొలంగండ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జబీవల కొమ్మరతో మృతి చెందిన ఇద్దరు చిన్నారుల మృతికి గల కారణాలను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూఢనమ్మకాలు మరియు నాటు వైద్యం వద్దని, పసరు మందులు వాడకూడదని పలు సూచనలు చేశారు. మూఢనమ్మకాలు కారణంగా జరిగే నష్టాలు పై అవగాహన కల్పించారు. అనంతరం నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల మరణాలు పై ఆరోగ్య సిబ్బంది ని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

జి.శివడ లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పరిశీలన : మండలంలోని జి.శివడ పంచాయతీలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ప్రతి ఒకరి వైద్య నిపుణులు రావడం వలన ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.బి.ప్రత్యూష, డాక్టర్.వి.అభిషేక్‌కుమార్ డాక్టర్.కె.వెంకట హర్ష, డాక్టర్. సరళ దేవి (జనరల్ మెడిసిన్) డాక్టర్.పి. పర్దన్ ప్యన్ (గ్యానకో) వైద్య నిపుణులు, గ్రామ సర్పంచ్ సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, 104 సిబ్బంది మరియు ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.